61010860I

# ప్రబోధ 28

ఎట్టి విద్యలు జగతిని యెరుగనట్టి
పక్షి జాతులు పశువులు పరమమైన
నియమమును బూని జీవింపనేర్చియుండ
తెలివి గల్గియు మనుజుడే తెలివిదప్పి
బ్రతుకుచున్నాడు మనుజునకే తెలివిలేదె.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

సృష్టి చిత్రంబులు యెంత విచిత్రమయ్యా! ఏ లోకమునందుగానీ, ఏ కాలమునందుగానీ, ఏ యిరువురి మనుషులయొక్క రూపములు, తెలివితేటలు, ప్రజ్ఞాన విజ్ఞానములు సమముగా నుండుటలేదు. భౌతికవాదులు ఏకత్వము యొక్క అనేకత్వాన్ని విరివిగా ప్రచారము చేయటము యిది ప్రపంచము యొక్క సహజము. కాని అనేకత్వములోని ఏకత్వాన్ని ప్రచురించే వ్యక్తులు చాలా అరుదు. పవిత్ర దృష్టితో సువిశాలమైన ప్రజ్ఞానముచే పరిశీలన జరిగినప్పుడు భిన్నత్వములోని ఏకత్వము సాక్షాత్కరిస్తుంది. ప్రాపంచకముగా, నైతికముగా, వైజ్ఞానికముగా ప్రతి మానవుని యొక్క ఆహార విహారములను ఏకత్వముగా గుర్తించటము జరుగుతూ వుంటుంది. రాజుమొదలు రైతు వరకును, కూటి పేద మొదలు కోటీశ్వరుని వరకును జనన మరణములు సమానమనే సత్యాన్ని యేకత్వము విశ్వసిస్తుంది. జాతి, మత, వర్ణ, వర్గ దేశ కాల పరిస్థితుల ప్రభావమునకు యేమాత్రము గురికాక ఏకత్వమనే సత్యాన్ని కఠోపనిషత్తు బోధిస్తున్నది. ప్రతి శరీరము కూడను రథము వంటిదని యీరథమునందు రౌతు ఒక ఆత్మస్వరూపుడై వున్నాడని, యీ పవిత్ర దేహమునకు సమత్వమైన చర్యలని కూడను యిది సమత్వము గావిస్తుంది.

మానవునియందు రెండువిధములైన తత్వములున్నవి. ఒకటి పశుత్వము. రెండవది దైవత్వము. దుష్టమైన కామక్రోధ మోహ లోభ మద మాత్సర్యములనే యీ అరిషడ్వర్గములకు లోబడి భగవత్ ప్రసాదమైన స్మృతి గతి మతి సంపత్తిని సద్వినియోగపరచుకొనక దుష్ట మార్గమునందు దీనిని ప్రవేశపెట్టి దుష్టుడై అనేకవిధములుగా

కూడను చతుష్టసంపత్తిని సాహసము చేత మానవుడు మరింత అధోగతికి గుర్రై పోతున్నాడు. ఈ విధమైన దుష్ట మార్గమునందు జీవితము ప్రవేశ పెట్టి దానియొక్క సత్యాన్ని గుర్తించక కేవలము అసత్యమునే విశ్వసించి, పరమాత్మని విస్మరించి కేవలము తన యొక్క జీవితమును అధోగతిపాలు చేసుకోటమే పశుత్వము యొక్క తత్వము. మానవుని యొక్క కాయమును, కాలమును, కర్మను, సంపదను సద్వినియోగ పరచి నీతి నిజాయితీలే జాతి యొక్క లక్షణామని భావించి, వీటిని పరోపకార దీక్షగా విశ్వసించి తన కర్మలను పవిత్రముగావించుకొనటమే దైవత్వము యొక్క తత్వము. మానవుని యొక్క ప్రవర్తనను పురస్కరించుకొనియే వానియొక్క మంచి చెడ్డలు ప్రకటిస్తూ వుంటాది. ఎట్టి భావమో అట్టి ఫలితము.

కనుకనే ప్రాచీనకాలమునుండి కూడను వేదములు, వేదాంగములు, స్మృతులు, ఇతిహాసములు, పురాణముల యొక్క ప్రమాణములను ఆచరించి ఆనందించి అన్యులకు అందించే అవకాశమే మన భారతీయ సంస్కృతి. ఇవి అనంతమైన సాగరాలు. ఇవి విజ్ఞాన నిలయాలు. సముద్రమునుండి నిత్యము సూర్యుడు తనయొక్క కిరణములచేత నీరును ఆవిరిగా మార్చుకొని ఆకాశమునందు మేఘములుగా రూపొందింపజేసుకొని, తదుపరి వర్షములను కురిపించి, పంటలను పండించి, ప్రకృతిని సస్యశ్యామలముగావించుచున్నాడు. ఈ నాడు యీవిధముగా నిత్యము సముద్ర జలమును అనంతముగా ఆవిరిగా మార్చుకున్నప్పటికి యీసముద్రము కించిత్ మాత్రము తాను తగ్గిపోవటం లేదు. నదులు పొంగి ప్రవహించి గట్టులు తెగి గ్రామములు ముంచినప్పటికిని, యీవిధముగా అనేక నదులు ప్రవహించి సముద్రమునందు చేరుచున్నప్పటికిని సముద్రము కించిత్ మాత్రము కూడను పెరుగుటలేదు. పెరిగి తరగని తత్వాన్ని వహించినదే యీ సముద్రము యొక్క లక్షణము. అదే విధముగనే భారతీయ సంస్కృతిని పురస్కరించుకున్న వేద వేదాంగముల యొక్క తత్వము తమ యొక్క బుద్ధికుశలత చేత తాము యెంత అందుకున్నప్పటికిని, ఎన్ని సంవత్సరములు, ఎన్ని యుగములు జరిగినప్పటికిని యిందులో యేమాత్రము తరిగే స్వభావము కాదు. ఇట్టి నిత్యసత్యమైన సంస్కృతిని భారతీయులు గుర్తించుకొనలేక కేవలము వీటిని అలక్ష్యపరచటం చేతనే విదేశీయులు దీనిని అపహరించి, దీని చేత అనేక విధములైన ఫలితములు పొందగల్గుచున్నారు. వేదాంగములు కేవలము ఆధ్యాత్మిక తత్వములనే ప్రచురించటము కాక విలువైన వైజ్ఞానిక తత్వాన్ని కూడను, సాంకేతిక విజ్ఞాన శాస్త్రమును కూడను విరివిగా ప్రకటించటానికి పూనుకున్నది. వేదమునకు పుట్టినిల్లు భారత దేశము. కానీ యీ వేదము యొక్క విహార స్థానము విదేశములు. వేదములో నాల్గవ వేదమైన అధర్వణ వేదము జపానులో చేరి

జర్మనీకి బయలుదేరి అనేక విదేశములందు అనేక విధములుగా కూడను వారికి వుపయోగకరముగా వినియోగించుకుంటున్నారు. ఈ వేదము ఖగోళ శాస్త్రము, తర్కశాస్త్రము, శిల్పశాస్త్రము, చిత్రశాస్త్రము, పదార్థశాస్త్రములతో కూడినది. ఇది గణిత శాస్త్రమునందు కూడను సాముద్రిక శాస్త్రమునందు కూడను చాలా గొప్పపేరు పొందినది. ఈ ఖగోళ శాస్త్రము యొక్క చిత్రమైన అనేక చిత్రములను అనేకమంది విదేశ శాస్త్రజ్ఞులు గుర్తిస్తూ వచ్చారు.

ఒకానొక సమయములో గొప్ప తత్వవేత్త అయిన Sir W. Hunter అనేవాడు యీ అథర్వణ వేదము యొక్క ఖగోళ శాస్త్రము యొక్క తత్వాన్ని గుర్తించి గ్రీసు దేశమునకు మించినదిగా వుంటున్నదని దీనిని యనేక విధములుగా వర్ణిస్తూ వచ్చాడు. ఈ విధమైన దివ్యమైన, విలువైన, పవిత్ర రత్నములను మనము గుర్తించుకొనలేక పోతున్నాము. రష్యాదేశములో ఉత్తర దిశయందు మాస్కోకు యించుమించు వేయిమైళ్ళ దూరములోపల ఒక విశాలమైన పట్టణమున్నది. ఆ పట్టణమునందు అనేక విధములైన భారతీయ సంస్కృతిని పురస్కరించుకున్న గ్రంథములు మహాపెద్ద గ్రంథాలయముగా నిర్మించుకున్నారు. అదే కాజా పట్టణము. ఈ కాజా పట్టణమునకు నాలుగువేల మైళ్ళ సమీపములో గల సుఖానది ప్రవహిస్తూ వుంటుండాది. ఈనాడు ఆ సుఖానదినే అనూ అని పిలుస్తూ వస్తున్నారు. దీనికి సమీపములో చాలా విలువైన సువర్ణములు లభ్యమవుతున్నదని అథర్వణ శాస్త్రము ద్వారా గుర్తిస్తూ వచ్చారు. అక్కడ Lady Vostalk అనే పెద్ద పట్టణమున్నది. ఈ పట్టణ సమీపములో యీ అథర్వణ వేదము యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించిన శక్తిమంతులు పరిశీలన చేయగా యిక్కడ అరువదితొమ్మిది సువర్ణపు గనులంతా కూడను లభ్యమయ్యాయి. కానీ భారతీయుల యొక్క పవిత్రతను వారు గుర్తించి యిలాంటి మహాభాగ్యము మాకు లభ్యమైనదని వారు యెంతయో దానిని వర్ణిస్తూ దానికి కృతజ్ఞతా రూపములోపల దానికొక చక్కని భారతీయ నామమును వుచ్చరిస్తూ వచ్చారు. దీని పేరు మహానిధి అన్నారు. ఇది భారతీయుల యొక్క పేరు కాదా! అనగా భారతదేశమునుండి వచ్చిన అథర్వణవేదము యొక్క అనుగ్రహమే యిదని, భారతీయుల యొక్క తత్వానికి కృతజ్ఞతగా యీ పేరును వారు ఉచ్చరిస్తూ వచ్చారు. రష్యనులయందు కేవలము దైవత్వమును మాత్రమే వుచ్చరించే వుత్సాహము లేదు. కానీ వారియందు ఘనమైన నీతి నిజాయతీలు వుంటున్నవి. ఈ విధమైన నీతి నిజాయతీతో వారి జీవితమునకు జాతిగా రూపొందుతూ వచ్చినాయి. మానవ జాతికి ప్రధానమైన లక్ష్యమే మన యొక్క శీలము. ఈ విధమైన గుణములు, సరైన నడత లేకుండిన యిది మానవత్వమే కానేరదు. మానవుని యొక్క విలువ ధనకనక వస్తు వాహనాదులలో లేదు. మానవుని యొక్క నడతలోనే వుంటున్నది. కనుక మానవుని యొక్క

610108604

నీతి తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. నీతి కలుగు జాతి నిజమైన జాతిరా అన్నారు. ఈ నీతియే మానవత్వము యొక్క తత్వాన్ని గుర్తించటానికి తగిన యొక్కవిలువ.

ఎన్ని విధములైన మార్గములలో భారతీయ సంస్కృతిని బోధించి తద్వారా నీతియే ప్రధానమైన సంస్కృతిగా విశ్వసిస్తూ వచ్చారు. సరియైన ప్రవర్తనే లేకుండినయిది మానవత్వమే కాదని కూడను విశ్వసిస్తూ వచ్చారు. కనుక మానవుని యొక్క శీలమనగా మూడు విధములైన తత్వములలో కూడినదని మనము గుర్తించాలి. మొదటిది పవిత్రము రెండవది సహనము. మూడవది పట్టుదల. కనుక దీనిని Perseverence అని పేరు పెట్టి P+P+P = C Purity + Perseverence + Patience = Character కనుకనే యీ మూడు ముచ్చటైన పదముల తత్వమునే భారతీయులు చిన్న వాక్యముగా పుచ్చుకొని విశాలమైన, అనంతమైన దివ్యత్వాన్ని ప్రకటిస్తూ వచ్చారు. అయితే యీనాడు అట్టి పవిత్రత వున్నదా ? పవిత్రత మనకు యేమాత్రము కూడను కనుపించటము లేదు. ఈ పవిత్రత వుండినప్పుడే మనలో సహనము యేర్పడుతుంది. ఈ విధమైన పవిత్రత సహనము రెండు కూడినప్పుడే మనలో ఒక విధమైన ధృడత్వము యేర్పడుతుంది. ఈ మూడింటికిని అవినాభావ సంబంధము, అన్యోన్యాశ్రయముగా కూడిన తత్వాన్ని మనము యీనాడు వ్యర్థము గావించుకొంటున్నాము. శారీరకమైన తత్వము లోపల మనము ఒకవిధమైన ప్రయోజనమునకు వుపయోగించాలి. పరోపకారార్థం యిదం శరీరం. ఈ శరీరమనేది సమాజము యొక్క సేవ నిమిత్తమై, సత్యాన్వేషణ నిమిత్తమై, అనేకత్వములో వున్న యేకత్వమును గుర్తించే నిమిత్తమై సంభవించినదని, ప్రాప్తించినదని మనము అర్థము చేసుకోవాలి. సహనము. దేని నిమిత్తమై సహనము. ఇది మన యొక్క స్వభావము. మానవత్వములో వుండిన సహనమే దివ్యత్వముగా మారి అద్వైతత్వముగా రూపొందుతుంది. ప్రతి కష్టమునకు, నష్టమునకు, దుఃఖమునకు, నిందలకు, నిష్ఠూరములకు మనము సహనాన్ని వహించాలి. సహనమే లేకుండిన జీవితమే సాగదు. కనుక సహనమన్నది మన జీవితము యొక్క, భారతీయ సంస్కృతి యొక్క ప్రధానమైన లక్షణము.

పరమ పావనమైన భారతావని యందు
సహన మన్నదె మనకు చక్కదనము.
వ్రతము లన్నింటి యందు వన్నెగాంచిన యట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావం బెది మనదేశమందన్న
మాతృ భావము కంటె మాన్యమెద్ది

ప్రాణంబు కంటెను మానంబు ఘనమను
మనదేశ నీతిని మంటగలిపి
నేటి కిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛ యను విచ్చుకత్తి
ఔర! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బల మెరుగ లేదో
అట్టులైనారు భారత ప్రజలు నేడు.

ఈనాడు మానవులకు గుణము అంటే యేమిటో అర్థము కావటము లేదు. ఈ గుణ తత్వాన్ని అర్థము చేసుకొనుటకైనా ప్రయత్నించటము లేదు. ప్రయత్నించి కూడను వికారమార్గమునందు దానిని అర్థము గావించుకొనుచున్నారు. కనుక యీనాడు మానవత్వమునే కోల్పోయి కేవలము దానవత్వము కంటెను హీనమైన ప్రవర్తన లోపల మానవుడు జీవితాన్ని వ్యర్థము గావించుకొనుచున్నాడు. కేవలము మానవుని యొక్క ఆకారమును మాత్రమే ప్రకటించుచూ, ప్రచురించుచూ తన యొక్క దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని విస్మరిస్తున్నాడు. కనుక ఎక్కడ చూచినా, ఎక్కడ విన్ననూ ప్రయత్నపూర్వకముగా సాధించటానికి ఒక విధమైన భయ భ్రాంతులతో కూడి వుంటుండాది జగత్తు. ఈ నాటి యందోళనలకు, యీ భయ భ్రాంతులకు, కరవు కాటకములకు మూల కారణమేమిటి? మన ప్రవర్తనయే. సరైన ప్రవర్తన మనము కలిగియుండినప్పుడు యీ ప్రకృతి కూడను సరైన ఫలితము అందిస్తూ వుంటుంది. చెప్పుమాటలకు, చేయు పనులకును భిన్నముగ జరిగిన దానిని మనము అనుభవిస్తున్నాము. The proper study of mankind is man. ఈ తత్వాన్ని మనము యీనాడు గుర్తించుకోటానికి రవ్వమాత్రము ప్రయత్నము చేయటము లేదు.

ఈనాడు మానవుడు సంకేతిక విజ్ఞాన శాస్త్రములో విరివియైన బలమును సంపాదించుకున్నప్పటికి యీ నైతికమైన విలువ దిన దినమునకు దిగజారిపోతున్నది. ఈ యొక్క నైతికమైన జీవితమే లేకుండిన యిది జీవితమనే అనిపించుకోదు. నైతిక జీవితముతో బాటు ఆధ్యాత్మిక జీవితము కూడను ప్రచురింపజేసినదే మన సంస్కృతి. ఇట్టి సంస్కృతిని మనము గుర్తించటానికి సంస్కృత విద్య మనము అభ్యసించాలి. జర్మనీలో, రష్యాలో, అమెరికాలో యిత్యాది ప్రాంతములందు కూడను యీ భారత దేశమునుండి కొనిపోయిన వేదగ్రంథములు గుర్తించుకొనే నిమిత్తమై తప్పని సరిగా అనేక విశ్వవిద్యాలయముల లోపల యీ సంస్కృతమును అభ్యసించటానికి అనేక ప్రయత్నములు జరుగుతున్నాయి. మన ప్రాచీన గ్రంథములన్నీ కూడను

సంస్కృతమునందే లిఖించ బడినవి. ఆసంస్కృతము నుండి ఆవిర్భవించినదే సంస్కృతి ఈ విధమైన ప్రోత్సాహ ఉత్సాహములు విదేశమునందు విరివిగా పెరిగి పోవుచున్నప్పటికి దీనికి నిరుత్సాహమును, నిస్పృహను మాత్రమే అభివృద్ధి అవుతున్నది చెప్పుకొనటము చాలా విచారకరమైన విషయము. ప్రాచీనకాలమునుండి భారత దేశము అన్నిదేశములకును ఉపాధ్యాయ స్థానము అలంకరించినది. ఈ సంస్కృతము నందున్న సంస్కృతి యొక్క తత్త్వాన్ని విదేశీయులు కూడను యెంతో శ్రద్ధతో భక్తితో దీనిని అనుభవించటానికి ప్రయత్నిస్తున్నారు. విదేశీయుల యొక్క జీవితమునే మనము అనుసరించటానికి ప్రయత్నిస్తున్నామే గానీ స్వదేశము యొక్క పవిత్రము, నిర్మలము, నిస్వార్థము అయిన యీ సంస్కృతిని మనము యేమాత్రము కూడను ఆచరణలో పెట్టుటకు అంగీకరించటము లేదు. ఎన్న భారతే తన్న భారత. భరత దేశములో లేనిది మరోదేశములో యేమాత్రము కూడను కనుపించవు. భారత దేశమున లేని రూపములు గాని, నామములు గాని యే పదార్థములుగానీ చాలా పవిత్రమైనవని కూడను అందరూ గుర్తిస్తూ వచ్చారు.

గ్రీసు దేశపురాజు భారత దేశమునకు ప్రయాణమై వచ్చుచుండగా ఆగ్రీకు యొక్క మతగురువు యీరాజునకు ఆజ్ఞాపించాడు ఒక విషయాన్ని. రాజా! నీవు పవిత్రమైన భారత దేశములో పాదము పెట్టుచున్నావు. కాన నాయొక్క చిరకాల వాంఛను నీవు తీర్చగలవని నేను విశ్వసిస్తున్నాను అన్నాడు. పవిత్రమైన గంగాజలమును ఒకపాత్రలో తీసుకొని రమ్మన్నాడు. దివ్యమైన భగవద్గీతను ఒకటి తీసుకురమ్మన్నాడు. భారత దేశము యొక్క పవిత్రమైన ధూళి కొంత తీసుకొని రమ్మన్నాడు. మానవాతీతమైన శక్తులను గుర్తించి మానవాతీతమైన జీవితాన్ని అనుభవించిన మహాభారతము యొక్క చరిత్రను కూడను ఒకటి కొనిరమ్మన్నాడు. మహాభారతమునందు నైతిక, భౌతిక, లౌకిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సంబంధమైన ప్రతి సూత్రము కూడను యిందులో యిమిడి వున్నవని బోధించాడు. విదేశీయులు భారతము యొక్క రహస్యాన్ని యీవిధముగా గుర్తిస్తే భారతీయులు భారతము అంటే ఏమిటంటే వింటే భారతము వినాలి తింటె గారెలు తినాలి అని గొంతులో పోట్లు కుంటున్నారు. మహా శ్రీమంతుడు, ధన వంతుడు అయినవాడు కుబేరుడు భారత దేశములో యిండొనేషియాలో ఒక బ్యాంకు పేరు కుబేరా అని కూడను పెట్టుకున్నారు. ఏర్ లైన్సుకి గరుడ అని పేరు పెట్టుకున్నారు. అనగా గరుడ అంటే ఎంత పవిత్రమైనది. విష్ణువాహనమని వారు గుర్తించారు. విష్ణువు అనగా సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు అయినవాడు. యీ గరుడ వాహనుడై సర్వత్ర వ్యాపించుచున్నాడు అనే సత్యమును వారు అర్థము చేసుకున్నారు. కానీ యీనాడు గరుడ అంటే పక్షిగా మనము భావిస్తున్నాము. నిజము

గా మనము భారతీయులమని చెప్పుకోవటము కూడను చాలాసిగ్గు చేటుగా వుంటున్నది. ఒకానొక సమయములోపల అమెరికా వెళ్ళినప్పుడు ఒకని పేరు చతుర్వేద శాస్త్రి అని. ఈ చతుర్వేదశాస్త్రి అనగా నాలుగు వేదములు కూడను గుర్తించిన వాడని దాని యొక్క అర్థము. ఈ నాలుగు వేదములు గుర్తించినవాడు మహావీరుడు అనుకున్నారు ఆ విదేశీయులు. ఒకానొక సమయములోపల భారతవేదమును కొంతవరకు తర్జుమా చేస్తూ కొన్ని శ్లోకములలో చక్కగా అర్థము తెలియక పోయింది. ఈ Max Muller యీ విధమైన అర్థముల నిమిత్తమై అనేక విధములుగా విచారిస్తూ వచ్చాడు. విదేశములకు వెళ్ళిన ప్రతి వ్యక్తి కూడను మొట్టమొదట Max Mullerను చూసి వచ్చేవారు. ఇతను కూడను తనపని తాను పూర్తి చేసుకొని ఇండియాకు తిరిగి రావాలని యీ చతుర్వేద శాస్త్రి, ఒక విజిటింగు కార్డు యిచ్చి లోపలకు పంపించాడు. Max Muller పట్టలేని ఆనందముతో వుప్పొంగి పడ్డాడు. చతుర్వేదశాస్త్రి ఏదో ఒక వేదార్థమును నేను గుర్తించాలని ప్రయత్నిస్తుంటే భారతదేశమునుంచి చతుర్వేదశాస్త్రి వచ్చాడు. యిది భగవంతుని యొక్క అనుగ్రహమే అని భావించాడు. తక్షణమే యీ Max Muller స్వయముగా వెళ్ళి ఆ చతుర్వేద శాస్త్రిని లోపలకు తీసుకు వచ్చాడు గౌరవముగా. లోపల ప్రవేశించిన తక్షణమే యెదుట భగవత్ స్వరూపము వచ్చినట్లుగా భావించాడు Max Muller. అతను Tea biscuits తో సరియైన తృప్తి పరచాడు. మీరు ఎక్కడనుండి వచ్చారని ప్రశ్నించగానే నేను భారత దేశమునుండి వచ్చానన్నాడు. నీ పేరు యేమనగా నా పేరు చతుర్వేద శాస్త్రి అన్నాడు. అహా! ఎంత అదృష్టవంతుడవు నీవు మహా భారతదేశమునందు పుట్టించిన వాడవు జన్మించినవాడవు, నీ జన్మ సార్థకమైంది అన్నాడు Max Muller. తక్షణమే ఒక గ్రంథము తీసుకువచ్చి యీ పదమునకు అర్థము ఏమిటి అని అడిగాడు. ఈ పదము ఎక్కడవున్నదని అడిగాడు యీ చదుర్వేద శాస్త్రి. ఇదుగో ఫలాని శంకర భాష్యములో వుంటున్నదని చెప్పాడు. ఇతనికి అర్థము తెలియదు. ఒక్క వేదము కూడను తెలియదు. అప్పుడు యితను ఆశ్చర్యపడ్డాడు. ఏమిటం టే చతుర్వేదశాస్త్రి అని పేరు పెట్టుకున్నారు ఒక్క వేదము యొక్క పదము అయినా మీకు తెలియదా అన్నాడు. పోనీ శంకరాచార్యుల విషయమేమైనా తెలుసునా అని ప్రశ్నించాడు. అట్టే ఆ శంకరాచార్యులు ఎవరో చాదస్త బ్రాహ్మణుడు. అప్పుడు అనుకున్నాడు Max Muller. దానికి పూర్వమంతా కూడను తన యొక్క అంత్యజీవితమంతా మహా భారతదేశము లోపల గడుప్రకొని తన యొక్క అంత్యకాలము యీ యొక్క శరీరమును యీ మహా భారతదేశమందే అంత్యము గావించుకోవాలని విశ్వసించుకున్నాడు. ఈ చతుర్వేదశాస్త్రి యొక్క పదములు విన్న తక్షణమే ఛీ ఛీ భారతదేశములో వుండిన వారందరు కూడను మహా పండితులు కాదు. ఎక్కడ వుండిన ప్పటికి హృదయస్థాయి ప్రధానమైనది అని అక్కడే భగవంతుని

స్మరించుకుంటూ యిక భారతదేశము వెళ్లకూడదని నిర్ణయించుకున్నాడు. ఈ విధముగా భారతదేశమునందు వుండినవారు మన శాస్త్రములు, మన సంస్కృతిని, మన సాధనను, మనయొక్క నీతి నిజాయతీలను యేమాత్రము గుర్తించుకొనలేక కేవలము గొప్పచదువులకై విదేశములకు వెళ్లటమనేది అగౌరవమైన విషయము. విదేశీయులు భారతదేశము వచ్చి భారతీయ సంస్కృతి విషయాన్ని చక్కగా గుర్తించి తెలుసుకొనగోరి అనేక విధములైన శ్రద్ధాభక్తులు నిరూపించుచుండగా భారతీయులు భారతదేశమునందే వుంటుండి తమయొక్క సంస్కృతిని గుర్తించుకోలేక పోవటము యెంత వెఱ్ఱితనము.

కనుక భారతీయ సంస్కృతియందు వుండిన ప్రధానమైనది ఒక గుణము. ప్రాచీన కాలమునుండి మన భారతదేశములో యీ character అనగా శీలమునకు యెక్కువ ప్రాధాన్యము నిస్తూ వచ్చేవారు. కనుకనే పూర్వము సంస్కృతిని పురస్కరించుకొని యీ character పోతే life పోయినట్టుగా వారు విశ్వసించేవారు. If character is lost everything is lost. If wealth is lost nothing is lost. If health is lost something is lost. యివి భారతీయ సంస్కృతి యొక్క ప్రధానమైన సూత్రములు. కానీ యీనాడు కారుకు రివర్సు వుండినట్టుగా యీ ఆధునిక జీవితము ప్రారంభమైన తక్షణమే దీనికి విరుద్ధముగా జరుగుతూ వస్తున్నాది. If character is lost nothing is lost. If health is lost something is lost. If wealth is lost everything is lost. ఇదే ధనమూలమిదం జగత్. ఇదా మన భారతీయ నిజమైన సంస్కృతి. ధర్మమూలమిదం జగత్ యిదే భారతీయుల నిజమైన సంస్కృతి. ధర్మాన్ని రక్షించుటకు ఎవ్వరు కూడను ముందంజ వేయటంలేదు. కాని అధర్మము ఆచరించుటకు ముందంజ వేస్తున్నారు. కనుకనే దేశము పాప భూయిష్టముగా మారిపోవుచున్నది. కనుక పాపమునకు మనము గురికాకూడదు. పుణ్యమును ఆచరించాలి. దీనినే భారతీయ సంస్కృతియందు

పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః

న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతు యత్నతః

అనగా పుణ్యము చేయుటము చాలా మంచిదని చెబుతున్నాము. పుణ్యము కావాలని ఆశిస్తున్నాము. కానీ పుణ్యకర్మలు చేయుటము లేదు. పుణ్యకర్మలు చేయక పుణ్యఫలము ఏరీతిగా లభ్యమవుతుంది. పాప ఫలము నాకు వద్దని అంటున్నాము. కానీ పాపకర్మలు ఆచరిస్తున్నాము, పాపకర్మలు ఆచరించినప్పుడు పాపఫలము వద్దంటే పోదుకదా! కనుక ఎట్టి కర్మలు ఆచరింతుమో అట్టి ఫలితము మనకు సిద్ధిస్తూ వుంటుంది. కనుక పవిత్రమైన కర్మలు ఆచరించటానికి ప్రతి వ్యక్తి కూడను పూనుకోవాలి. ఈ మానవత్వమనేది యెంత పవిత్రమైన

దని గుర్తించటానికి ప్రయత్నించాలి. భారతీయ సంస్కృతి యొక్క విలువను మనము అర్థము చేసుకోవాలి. అర్థము చేసుకొనుటకు కాలము లేకపోయినా, ఇష్టము లేకపోయినా దానిపెడార్థములు చేసుకోటానికి ప్రయత్నించకూడదు. వటిని హాస్యాస్పదము చేయటానికి అంతకంటె ముందంజ వేయకూడదు. గౌరవించటానికి ప్రయత్నించాలి. కృతజ్ఞతను నేర్చుకోవాలి. కాని మనము పొందిన ఫలితమునకు కృతజ్ఞత చెప్పకుండా క్రూరులుగా మారి పోతున్నాము. ఈనాటి యువకులు యే విధమైన భావములు వుచ్చరిస్తున్నారో ఆభావములను ఆచరణలో పెట్టటానికి తగిన కృషి చెయ్యాలి. కేవలము మాటలయందు మాత్రమే చెప్పి క్రియలందు వినియోగించకుండిన యిది మానవత్వమునకు విరుద్ధమైన తత్వము. కనుక యే విధమైన భక్తిశ్రద్ధలతో హృదయపూర్వకముగా మీరు యిట్టి వుపన్యాసములు యిస్తున్నారో ఆవుపన్యాసములు జీవిత పర్యంతము కూడను మీరు ఆచరణ యందుంచి, మీరు ఆనందించి పదిమందికి అందించటానికి ప్రయత్నించాలి. ఈ విధమైన విద్యార్థులు, యువకులు కేవలము ఒక పదిమంది పవిత్రులుగా చిక్కినప్పటికిని చాలు జగత్తునంతా మనము ప్రచారము సలుపవచ్చును. ప్రచారమునకు ముందు నీవు మొట్టమొదట ఆచరించు. అనుష్ఠించు. అనుభవించు. ఆనందించు. తదుపరి పదిమందికి పంచు. ఇది మనయొక్క కర్తవ్యముగా మీరు కంకణము కట్టుకోవాలి. కర్తవ్యమును నిర్వర్తించుకోటమే మనయొక్క ప్రధానమైన ధర్మముగా మనము గుర్తించాలి.

కాలము అతి వేగముగా ప్రచండ మారుతము వలె కదలి పోవుచున్నది. జీవిత ప్రమాణము మంచుగడ్డవలె క్షణక్షణమునకు కరగిపోవుచున్నది. కర్తవ్యమును గుర్తించక మునుపే కాయమును వదలిపెడుతున్నాడు మానవుడు. మానవుడు పుట్టినందుకు ఫలితమేమిటి? దేని నిమిత్తము నీవు పుట్టావు. తిండి నిద్రాదుల కోసమా? భయమైథునాదుల కోసమా? కాదు కాదు.

ఆహార నిద్రా భయ మైథునాని సామాన్యమే తత్పశు భిర్నరాణాం
జ్ఞానం నరాణా మధికం విశేషః జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః.

ఇలాంటి జ్ఞానమే లేక పోతే పశువుతో సమానము, ద్విపాద పశువనే చెప్పవచ్చును. ఆహార నిద్ర భయమైథునాదులు కేవలము పశుపక్షి మృగాదులకు కూడ వుంటున్నవి. ఇలాంటి ఫలితము అనుభవించే నిమిత్తమా మానవత్వము రావాలా? కాదు. కాదు. ఆదర్శవంతమైన జీవితాన్ని అనుభవించాలి. అందించాలి. అందులో విద్యార్థుల యందు యిది ప్రధానమైన లక్షణముగా భావించాలి. వారే భవిష్యత్తు యొక్క నాయకులు. కనుక వారి యొక్క భావములను సున్నితమైనవిగాను, పవిత్రమైనవిగాను, నిర్మలమైనవిగాను, నిస్వార్థమైనవిగాను, తీర్చిదిద్దుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. ఈ విధమైన పవిత్రమైన సంస్కృతిని ప్రచారము లోపల

61010861O

ఆచరించి ఆనందించటానికి తగిన ప్రయత్నము చేయాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నేను విరమిస్తున్నాను.